చన్నీళ్ల సముద్రంలో వేణ్ణీళ్ల బొట్టు

కథా ప్రారంభం

1. అవసరం
2. అహంకారం
3. అభిమానం
4. అభ్యర్థన
5. అమ్మకం
6. అలసట
7. అనుమానం
8. అనుభవం

కథా ప్రారంభం

విశాఖపట్నపు ఆకాశాన్ని పొద్దు పొడిచింది. చీకటిని చీల్చుకొని సముద్రపుటంచున బయట పడ్డ సూర్యకిరణం, ఎత్తైన ఇళ్ల మధ్యన ఇరుక్కున్న సన్నని వీధుల్లో అడ్డంగా నిలబెట్టిన లారీల్ని, నిలబడ్డ గేదెల్ని తప్పుకుంటూ ప్రయాణంచేసి అల్లిపురంలో అద్దెకుంటున్న కనకమహాలక్ష్మి కంట్లో పొడిచింది. కనకమహాలక్ష్మి ఇంటి పనుల్లో పడటానికి అయిన ఆలస్యం గురించి కంగారుపడ్తూ, పక్కమీదనుంచి లేచింది. అల్లా లేస్తూ మంచం పక్కనే ఉన్న స్టూల్ని కాలితో అలవోకగా తన్నింది. తన్ని తను కింద పడింది. స్టూలు మీద నున్న ఫాన్ కాసేపు అటూ ఇటూ ఊగిసలాడి ఓ నిర్ణయం తీసుకొన్నదానిలా కనక మహాలక్ష్మి మీద పడింది. తను పడ్తూ స్టూల్ని తోడ్తెచ్చుకొంది.

"ఎన్టీ రామారావుని మళ్లీ గవర్నర్ బర్తరఫ్ చేసేసాడా? ఊళ్లో కాలేజీ కుర్రాళ్లు అన్యాయాన్ని అరకట్టాలంటూ అలజడి మొదలు పెట్టారా? ఎవరైనా ఈ సందట్లో ఇంట్లో దూరి అన్ని సవరిస్తున్నారా?" అని నరసరాజు పక్కమీద నుంచి లేవకుండా కళ్లు తెరవకుండా జనాంతికంగా ప్రశ్నలు కురిపించాడు. అక్కడ భార్య ఉండి జవాబు చెప్తే సరేసరి, ఆమె అక్కడ లేకపోయి. ఎన్టీ రామారావుగాని, గవర్నరుగాని, కాలేజీ కుర్రాళ్లుగాని, కనీసం ఇంట్లో దూరిన వాళ్లు కాని అక్కడ ఉంటే జవాబు చెప్పాలన్న ధోరణిలో...

"మీ తెలివి తెల్లారింది గాని లెండి" అని కనక మహాలక్ష్మి విసుక్కొంది. ప్రేమించి పెళ్లి చేసుకొన్న నరసరాజు దగ్గర ఒకటి రెండు మాటలనదగ్గ చనువు ఆ పిల్ల పెళ్లి కాకముందే పొంది ఉంది.

నరసరాజు, ప్రమాదం తనూహించిన దానికంటే భిన్నమైనదీ, సన్నిహితమైనదీ అని. పెళ్లాం విసుగునుబట్టీ పోల్చుకొన్నాడు. పోల్చుకొని ఒక్క ఉదుటున లేచి కూర్చుని పరిస్థితిని ఆకళింపు జేసుకున్నాడు. కనక మహాలక్ష్మిమీద నుంచి ఫాన్ తప్పించి స్విచ్ ఆఫ్ చేసాడు. కనక మహాలక్ష్మి ఈసారి కోరి స్టూల్ని కాల్తో తన్ని దూరం చేసింది.

"నువ్వు రోజూ రాత్రి గాలికెంత ఇబ్బంది పడ్తున్నావో నిన్ననే నాకు చిలక్కి చెప్పినట్టు చెప్పావు. నాకు నువ్వు గోలెడ్తున్న విషయం అర్థమైందని నీతో చెప్పటం మర్చిపోయాను కామోసు! దాన్ని నువ్వపార్థం చేసుకొని నా కెల్లాగయినా అర్థమయ్యేలాగా చెప్పాలనుకొని,

ఫాన్ డైరెక్టుగా నీ వంటి మీద పెట్టుకొని పడుక్కొని అంత దగ్గరగా ఉంటేగాని ఫాన్ గాలి తగల్దని సూచించడానికి పూనుకోవడం ఏం బాగా లేదు తాయారూ!" అని తను నొచ్చుకొన్నట్లు అభినయిస్తూ అన్నాడు నరసరాజు.

"ఈ జానా బెత్తెడు కొంపలో మనకి, మన సామానుకే చోటు లేదని, అందుకనే మీరు మరో రెండంగుళాల పెద్ద ఫాను కొనలేదని నాకు తెలియదా రాజుగారూ! పొద్దున్నే లేస్తూ ఇంకోరిదీ ఇంకోరిదీ ఎందుకు, పతి దేవుల మొహమే, మోహన రూపమే చూస్తూ లేస్తే పోలేదా అని మీకేసి చూస్తూ లేచి అడుగు వెయ్యబోతే అది మంచపు కోడుకి, స్టూలుకి మధ్య నున్న అడుగు జాగాలో పడక, పక్కనున్న స్టూలుకి తగిలి నేను ముందు, ఫాన్ తరువాత పడ్డంతో నేను దాని అడుగున పడ్డాను. అడుగున పడిన తెలుగు ఆడపడుచుని ఆ విధంగా ఆట పట్టించడం....

"ఛ.... ఛ.... అడుగున పడ్డ భార్యకి, ఈ భర్త చేయూత ఎప్పుడూ ఉంటుంది" అంటూ నరసరాజు, కనక మహాలక్ష్మి కుడి చేతిని తన కుడి చేతిలోను, నడుమును ఎడం చేతిలోను, పొదివి పట్టుకొని లేవదీశాడు. లేవదీస్తూ, "పైకిలే! పైకిలే! ఆంధ్ర మహిళా!" అని రోజూ రేడియోలో వచ్చే తెలుగు పడతి భక్తి గీతం పాడాడు.

1. అవసరం :

"ఇంతకంటే పెద్ద భాగానికి మీ జీతంలో నోచుకోము కదా!" అంది కనకమహాలక్ష్మి వ్యధను కంఠంలో పలికిస్తూ.

"విశాఖపట్నంలో అద్దె సర్ప ద్రష్టులు ఇంటి భ్రష్ట సంపాతకులై ఉన్నదాని కంటే చిన్నదాంట్లోకి, అక్కడ నుంచి మరింత చిన్నదాంట్లోకి మారకుండా ఉండ గలగటమే టెన్ థవ్‌జెడ్స్ సంపాదించినంత భాగ్యం" అని సరసరాజు అనునయించబోయాడు.

"నేను కూడా సంపాదిస్తానంటే వినరుకదా! పెద్ద ఇంట్లోకి పోగాలం దాపురించనివారు భార్య మాట వినరని కదా పెద్ద నాయకమ్మగారు మొత్తుకుంటారు! అని సణుక్కొంది కనక మహాలక్ష్మి.

2. అహంకారం :

"మళ్లీ నా కోసం తపించి పెళ్లాడానంటారు" కనకమహాలక్ష్మి ఆ మాటలు తనకి నమ్మశక్యం కానట్టు అంది.

"తపించడమా! ఒంటి కాలు మీద తపస్సు చేసాను. కావాలంటే మా పక్కింటి గుంట నర్సమ్మ నీ స్నేహితురాలేకదా! అడుగు చెప్తుంది."

"ఆ చెప్పింది, కనకాలోసే! ఆ గుంటడెప్పుడూ ఈ మధ్య వంటి కాలు మీద నిలబడి అగుపిస్తున్నాడు. రెండో కాల్నిగాని మనూరి సిటీ బస్సు మట్టేసింది గాని ఏమో! అని ఆ రోజుల్లో అందుకేకదా నేను తమ నడత మీదో కన్నేసి ఉంచానా రోజుల్లో!"

"అదా కథ! నా డియరెస్టు ఫ్రెండు మీ వీధి అపల్నరసింహం, లేడూ వాడు 'నరస రాజొరే! నీ లవ్వు రెండోకన్నోసారి కె.జి.హెచ్‌లో చూపించుగ్గాని పెళ్లాడకురా! అని సలహా పారేసాడు".

"మీ తెలివి తెల్లారింది. మీ ఫ్రెండు తెలివి తెల్లారింది. సంతోషించాం"

"తెల్లారిందా! మర్చేప్పవేం! అయితే కాఫీ తొందరగిచ్చెయ్"

కనకమహాలక్ష్మి, అతనికి కాఫీ గ్లాసందించింది. అందించి మురిపెంగా చూసింది "నేను కూడా ఏదైనా ఉద్యోగం చేస్తాను. డబ్బు సంపాదించి మీకు సాయం చేస్తాను. చన్నీళ్లకి కాస్త వేణ్ణీళ్ల సాయం" అంది.

"తప్పు సామెత" అందామనుకొన్నాడు. కాఫీ గుటక పడక మాటలు బయటికి రాలేదు.

"ప్రేమించి పెళ్లాడినవాళ్లు పెళ్లాం మాటలు నెత్తినెట్టుకోవాలి! అంతేకాని గొంతుకలో పెట్టుకొని గుటక వెయ్యకపోడానికి అవేం కాలకూట విషప్రాయాలా! నాకు పెద్దింట్లో ఉండాలని, మొగుడికి కాఫీ గ్లాసులో కాక కప్పులో ఇవ్వాలని, పని మనిషిని పెట్టుకోవాలని, గుండుగాడ్ని మంచి స్కూల్లో చదివించాలని ఏవో ఇలాంటివే కొద్ది చిన్న కోరికలున్నాయి. అవి తీరే ఉపాయం చూడండి."

నరసరాజు ఆలోచనలో పడ్డాడు.

"భార్యా భర్తలన్నాక పాలు నీళ్లులాగా, ఇసుక సిమెంటుల్లాగా, వేణ్ణీళ్లూ, చన్నీళ్లలాగా, వాళ్ల అభిప్రాయాలు కలిసి పోవాలి కదా!"

నరసరాజు అతి కష్టం మీద కాఫీ మింగి, "అవును బి.జె.పి., జనతావాళ్ల అభిప్రాయాల్లాగా కలిసి పోకుండా ఉండరాదు" అని ఒప్పుకొని, "అందుకని నేను చెప్పినట్టు నువ్వు ఉద్యోగం చెయ్యకుండా ఉండటానికి ఒప్పుకో!" అని సూచించాడు.

"మీ మాట ఎప్పుడూ వింటూనే ఉంటాను కదా! వెరైటీ కీసారి, మీరు నా మాట విని, ఒప్పుకోండి." ఇద్దరు ఏకాభిప్రాయానికి రావాలన్న విషయంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. ఆ ఏకాభిప్రాయం ఏదన్న విషయంలో భేదాభిప్రాయపడ్డారు.

"నిన్ను వీధిలోకి పంపనా! ఆడదీరోజుల్లో వీధిలోకి వెళ్లటం ఎంత ప్రమాదం! క్షేమంగా ఇంటికి రాదు తిరిగి."

"అన్న అధికారంలోకి వచ్చాక ఆడపడుచులు అర్ధరాత్రి కూడా రోడ్ల మీద క్షేమంగా తిరగల్గుతున్నారు కదా!"

"క్షేమంగా తిరిగ గల్గటం మంచిదే అయినా అన్న అధికారంలోకి వచ్చాడు కదా అని ఆడవాళ్లిల్లా అర్ధరాత్రిపూట రోడ్ల మీద తిరగటం నాకు నచ్చదు. అయినా అన్నెప్పుడూ అధికారంలోనే ఉంటాడని ఏముంది! ఏ తమ్ముడో ఎప్పుడో ఎసరు పెట్టేస్తాడు కదా! అందుకని నేను చెప్తున్న దేమిటంటే నువ్వు వీధిలోకి వెళ్లవద్దు. నేనే మరింత సంపాదించి నిన్ను సుఖపెడ్తాను. ఆ మార్గాలు నేను అన్వేషిస్తాను కనకం! కనకాన్ని అన్వేషిస్తాను." అని నరసరాజు కాఫీ గ్లాసు పుచ్చుకొని అక్కడ్నుంచి పోయాడు భార్య చర్చని పొడిగించే అవకాశం లేకుండా.

నరసరాజు ఊళ్లో షికారు కెళ్లాడు అయిడియాల కోసం. ఏదైనా కొట్లో పద్దులు రాస్తే సాయంత్రాలు? పోని సినిమా హాల్లో గేట్లు కాస్తే? ఛ అయిడియాలు బాగా లేవు. పోనీ రిక్షా తొక్కితే? బావుంది. అది స్వతంత్ర జీవనం! గొప్ప సినిమాటిక్‌గా ఉంటుంది. భర్త సుఖం కోసం సినీ కష్టాలుపడ్డ పతివ్రతల పేర్లలాగా, తన పేరు అజరామరంగా నిలుస్తుంది. ముందు తరాల వారు షాజహాన్ భార్య కోసం తాజమహల్ కట్టించాడు కాని సైకిల్ రిక్షా తొక్కలేదు కదా! నరసరాజే షాజహాన్ చక్రవర్తి కంటే గొప్పవాడు అని చెప్పుకొంటారు. షికారు పూర్తి చేసుకొనివచ్చి కనకమహాలక్ష్మికి తను డబ్బు సంపాదించబోయే మార్గం చెప్పేసాడు.

కనకమహాలక్ష్మి కన్నీరు పెట్టుకొంది. తన కలకంఠంతో. "నాకు పెద్ద ఇల్లంటే అసహ్యం. ఉన్న ఫాన్ అమ్మేద్దాం. మీరు సైకిల్ రిక్షా తొక్కలేరు. తొక్కవద్దు'' అని బతిమాలుకొంది తన మాట వినమంటూ.

"ఎన్టీఆర్, ఎమ్జీఆర్. ఏఎన్నార్‌లు రిక్షాల్లాగగా లేంది నేను తొక్కలేనా! నీ మాట నే వినను సుబ్బులూ! వినను నాకా కీర్తి కావలసిందే?''

నరసరాజు మాట నిలబెట్టుకొన్నాడు. ఒక ఆదివారం సైకిల్ రిక్షా అద్దెకి తీసుకొని తొక్కాడు. స్నేహితులు నవ్విపోయారు. "నాకేటి సిగ్గు'' అని అతను పట్టించుకోలేదు. ఆ సాయంత్రానికి అద్దె పోనూ మిగిలిన నాలుగు రూపాయలు పెళ్లాం దోసిట్లో పోసాడు.

ఆ మర్నాడు వళ్లు పులిసిపోతే, "సినిమాల్లో హీరోలు అప్పుల్లో రిక్షా తొక్కేసీన్లలో డూపుల్ని పెట్టుకొంటారని నువ్వెందుకు నాకు గుర్తు చెయ్యలేదు'' అంటూ భార్యను మంచం మీద నుంచే ఛెడా మడా కేకలు వేసాడు.

ఆ పైన మూడు రోజులు కాజువల్ లీవ్ పెట్టి రెస్టు తీసుకొన్నాడు, పురుషాహంకారానికి శిక్షగా.

3. అభిమానం

"గుండు ఈ రోజు బడెగ్గొట్టాడా?''

గుండు స్కూల్ నుంచి రాగానే పుస్తకాలు వీధి గుమ్మం దగ్గర పారేసి, చెప్పులు వంటింటి దగ్గర విడుస్తాడు. అవి కనక మహాలక్ష్మి ఆ తరువాతెప్పుడో వాటి స్థానాల్లో పెడ్తుంది. నరసరాజు ఆఫీసు నుంచి వచ్చేసరికి పుస్తకాలు వీధి గుమ్మం దగ్గర ఎదురవ్వాలి మామూలుగా అయితే. ఆ రోజు అవలేదు. అందుకని అడిగాడు.

"అవును'' కనకమహాలక్ష్మి ముభావంగా జవాబిచ్చింది.

"ఎందుకుట?''

"నాకేం తెలుసు? వాడ్నే అడగండి''

"గుండూ!" గుండు వచ్చాడు.

"ఏరా స్కూల్లేదా?''

"నేను వెళ్లను'' అన్నాడు గుండు, స్కూలు ఉండటానికి, లేకపోవడానికి, తను వెళ్లక

పోడానికి ఏమీ సంబంధం లేదన్న విషయం స్పష్టం చేస్తూ...

"ఎందుకు వెళ్లవురా?"

"మా మేష్టారు దొంగ నంజికొడుకు. నన్ను కొట్టాడు."

"ఏమిట్రా ఆ భాష!" నరసరాజు కొడుకు భాషకి షాక్ తిన్నాడు.

"మీ పుత్రరత్నం ఆ దుంపల బళ్లో అంతకంటే ఏం నేర్చేసుకోవాలని కోరుకుని వాడిని పంపుతున్నారో ఆ స్కూలుకి"

"నువ్వు మరీని కనకాలు! అన్న. మధ్యాహ్న భోజన పథకం అమలులో పెట్టాక దుంపల బళ్లెక్కడున్నాయి. అన్నీ అన్న పాఠశాలలై పోయాయి కదా! అన్నం పెట్టే బళ్లు దుంపలిచ్చే బళ్లకంటే గొప్పవి కదా! అందుచేత మనవాడికి ఆస్మదీయులెవరో, దొంగ నంజికొడుకులెవరో తెలుసుకో గల్గటానికి మించిన చదువు అక్కడ చెప్పాలని ఆశించటంలో తప్పులేదు కదా!"

"బళ్లల్లో స్టాండర్డు., పెట్టే తిండి బట్టే మార్తుందని తమరన్నారు. నేను విన్నాను."

"అన్యాయం అమ్మాజీ! నువ్వేకదా దుంపల బడీ అంటూ వాడి స్కూలిని ఈసడించి పారేసావు. వాళ్లు దుంపలు ఇంకా ఇస్తున్నారన్న అభిప్రాయంలో ఉన్నావని కరెక్టు చేశాను"

"దుంపలు పెట్టడం మానేసినా పెడ్తున్నది అన్నం కాదు కదా. ఆ పథకంలో."

"మీ స్కూల్లో ఏం పెడ్తార్రా గుండూ!" నరసరాజు ఇన్నాళ్లకి అవసరం కల్గి తెలుసుకో గోరాడు. ఏం పెడ్తున్నారో తెలుసుకోకుండా భార్యతో వాదించదలుచుకోలేదు.

"మా స్కూల్లో ఏం పెడ్తారో నాకేం తెల్సు! నేను చూడక ముందే నంజికొడుకులందరు మీదపడి లాక్కుంటారు కదా!"

నరసరాజు గుండు, గుండు మీద టెంకిజెల్ల పుచ్చుకున్నాడు.

మర్నాడు అతను కొడుకు స్కూలుకి వెళ్లాడు., కొడుకు స్కూల్లో నేర్చుకొన్న నాలుగు ముక్కల్లోను ఒకటి నంజికొడుకైనందుకు సంతోషించలేక మేష్టార్తో తన కొడుకు 'నంజికొడుకు' పదం వాడ్తున్నట్టు అది తనకి నచ్చలేదన్నట్టు చెప్పాడు.

"నాకూ నచ్చదండి. స్కూల్నిండా అలాగా గుంటల్లు. ఓర్లంజకొడుకుల్లారా! నంజి కొడుకనరాదర్రా అంటూ మొత్తుకొంటూనే ఉంటాను వినరు" అన్నాడా పంతులు. అతను ల.న లకి అభేదం అన్న సూత్రం తెలుగులో లేదని గుంటల్లకి చాలా సార్లు చెప్పాడు. వాళ్లు, "నేదా!" అంటూ ఆశ్చర్యపోయారు, అన్నిసార్లూ. పంతులు తన బాధ వెళ్లబోసుకున్నాడు. నరసరాజుకి అసలు సమస్య అర్థమైంది.

మర్నాడే గుండుని, నెలకి యాభై రూపాయల జీతం పుచ్చుకొనే స్కూల్లో జేర్చాడు అప్పుచేసి, చేసిన అప్పు వాయిదాల మీద తీర్చటం మొదలవగానే పొద్దున్న కాఫీ అరగ్లాసుకి పడిపోయింది. ఆఫీసుకి వెళ్లేటప్పుడు మాత్రం బస్సులో వెళ్లి తిరిగి రావటం నడిచి నెమ్మదిగా వస్తున్నాడు.

కనకమహాలక్ష్మి వాన పడ్తున్న ఓ రోజున స్నానానికి చన్నీళ్లు పెట్టింది.

"వేన్నీళ్లంటే బావుండును" అన్నాడు నరసరాజు.

"చన్నీళ్లలో కొద్దే అయినా వేన్నీళ్లు పొయ్యగలిగితే ఎందుకు బావుండదు" అంది కనకమహాలక్ష్మి భావగర్భితంగా.

"ఆ ముచ్చటా తీర్చుకో" నరసరాజు తెల్లజెండా ఊపాడు.

4. అభ్యర్థన :

కనకమహాలక్ష్మి ఉద్యోగం చెయ్యాలని నిశ్చయించుకొంది కాని ఆ మహాపట్నంలో తన అర్హతలకి ఏం ఉద్యోగం వస్తుందో ఆమెకి తెలియలేదు. ఎన్నో ఆఫీసుల అరుగు లెక్కింది. కాయితాలు ఖరాబు అయ్యాయి. చెప్పులరిగాయి. ప్రయోజనం కనిపించలేదు. ఒక రోజు పక్కింటి నుంచి అరువు తెచ్చి చదువుతున్న దినపత్రికలో ఓ ప్రకటన ఆ ఉద్యోగార్థిని కళ్లబడింది అది ఇల్లా ఉంది :

అప్పారావు, భాగస్వాములు.

గోళ్లు గిల్లుకోనక్కర్లేదు!

మీ ఈ భర్తలు ఆఫీసుల్లోను, పిల్లలు స్కూళ్లల్లోను, బిజీగా ఉన్న సమయంలో మీరు గోళ్లు గిల్లుకుంటూ ఇంట్లో కూర్చోవాల్సిన అవసరం మీకిక లేదు. మా నమ్మకమైన ఎరువులు, తెగుళ్ల మందులు వాడి పెరట్లో పూల మొక్కలు పెంచండి. మీరు కొన దలచుకోకపోయినా, మీకు తెలిసిన వారికి (తెలియని వారికి కూడా!) వాటిని మీరు అమ్మగలమని నమ్మినా చాలు. వచ్చి మాతో సంప్రదించండి. మంచితనం చిందించే అందం, ఇంటింటికి వెళ్లి అమ్మగలిగే ఓర్పు, దానికి కావలసిన ఆరోగ్యం మీకుంటే అమ్మకాలమ్మాయి ఉద్యోగం మీదే!

ఓర్పు ఆరోగ్యం తనకున్నట్టు కనకమహాలక్ష్మికి తెలుసు.

"నువ్వెంత మంచిదానివే" అంటుందామె స్నేహితురాలు నర్సమ్మ ఎప్పుడూ.

"అందాలు చిందించే అంగనామణీ! నా భార్యామణీ" అని మెచ్చుకొంటాడు భర్త ఎప్పుడైన మూడ్‌లో ఉన్న మల్లెల వేళ.

సాయంత్రం భర్తకు ఆ ప్రకటన చూపించింది. "ప్రయత్నించి చూడు. మొక్కల చీడలు వదిలినా వదలకపోయినా, దీంతో మనింట్లో గోల వదుల్తుంది." అంతకే మురిసి పోయింది కనకమహాలక్ష్మి.

ఆ రాత్రి ఎప్పుడు తెల్లార్తుందా అని ఆత్రంగా ఎదురు చూస్తూ ఆత్రంగా గడిపింది. పొద్దున్నే ఫాన్‌ని ఉంచిన స్టూల్ని తన్ని, తను కిందపడ్డా ఆ దోసెడు కొంపని విసుక్కోలేదు. ఆ యింట్లో ఇంక తనుండ బోయేది కొద్ది రోజులే కదా! దాన్ని విసుక్కొని దాన్ని, భర్తని చిన్నబుచ్చకూడదు! నిజానికది చిన్నదే కాని తనని ఇన్ని సంవత్సరాలపాటు కడుపులో పెట్టుకుని ఆదుకొంది. ఇప్పుడు తన తాహతు పెరగబోతోంది కదా అని చిన్న చూపు చూస్తే పాపం చిన్నది బాధపడ్తుంది అని కనకమహాలక్ష్మి బోలెడు సెంటిమెంటల్‌గా ఆలోచించింది.

తొమ్మిది గంటలకు అందంగా తయారై, భుజానికి సంచీ తగుల్చుకొని, "గుండూ! రా!

నీతో నీ స్కూలు దాకా వస్తాను" అంది.

"అమ్మా! ఆ జోలెందుకూ?" అనడిగాడు గుండు.

"ఉద్యోగం ఇస్తే వాళ్లిచ్చిన సరుకులు వేసుకోవద్దూ!" అని శాంతంగా జవాబు చెప్పింది కొడుకు తన సంచిని జోలె అన్నందుకు కొంకించుక బాధపడినా.

"ఇవ్వకపోతే" గుండు కీడెంచాడు, అమ్మెల్లాగూ మేలెంచింది కదా అని.

"ఏదో అల్లా కాలక్షేపంగా నాలుగు వీధులు తిరిగితే సరి, జోలెనిండకపోదు" నరసరాజు చివరి బాణం వేసి చూసాడు.

"నేను ముష్టిదాన్లా కన్పిస్తున్నానా!" అని కనక మహాలక్ష్మి ముక్కెగ బీల్చింది.

"వెర్రి వెంకమ్మా! ముష్టెత్తడాన్ని అల్లా తీసి పారెయ్యకు. ఉద్యోగాన్ని ఆర్థించడం ఏమిటి? ముష్టెత్తడమే కదా! అభ్యర్థి అంటే ముష్టివాడు అని అర్థం. ఐ బెగ్ టు సబ్మిట్ పై అప్లికేషన్‌తో ముష్టి మొదలై, ఐ బెగ్ యు టూ గ్రాంట్ మీ టూ డేస్ కాజువల్ లీవ్ అంటూ కొనసాగి, ఐ బెగ్ యు టు నాట్ టు రిటైర్ మి ఎట్ ఫిఫ్టీ ఫైవ్ అంటూ ముగుస్తుంది. అందుకని చింతించక పోయిరా!"

సిగరెట్ ముట్టించుకోడానికి వెలిగించిన అగ్గిపుల్లతో హారతిచ్చి భార్యని దీవించి పంపాడు.

అప్పారావు ఎసోసియేట్స్‌లో అప్పారావు ఒకడే కూర్చుని ఉన్నాడు. అతను కనక మహాలక్ష్మిని చూసి ఉద్యోగం ఇస్తానన్నాడు. అయితే దానికి జీతం అంటూ ఉండదు. అమ్మిన దాని మీద పది శాతం కమీషన్ మాత్రం ఉంటుంది. "మీరు సరుకెంత బేగమ్మేస్తే మీ కంత లాభం" అని ప్రోత్సహించాడు. కనక మహాలక్ష్మి ఉత్సాహంగా రంగంలోకి ఉరికింది.

5. అమ్మకం :

"ఏమండీ! మీ ఇంట్లో పూల మొక్కలున్నాయా?"

"ఏం? నువ్వు పీక్కుపోతావా?"

"మీ మొక్కలకి తెగుళ్లు పట్టకుండా ఉండటానికి...."

"నువ్వు లోపలికి రాకపోతే చాలు"

రెండ్రోజులు కాళ్లరిగేలాగా తిరిగినా ఫలితం లేకపోవటంతో మూడో రోజు వ్యూహం మార్చేసింది.

"పిన్నిగారూ! మీ పెరడు కళ కళ్లాడ్తోంది. మీకు మొక్కలంటే చాలా ఇష్టం అని మీరు చెప్పకుండానే తెలుస్తోంది. నన్నడిగితే.... అహఁ నన్ను అడగక పోయినా సరే.... మీ తోటలో ఒక మల్లె మొక్క లేకపోవటం ఒకటే లోటు. అది వేసి చూడండి. ఈ జిల్లాలోనే మీ తోటకి పోటీ ఉండదు. మల్లె అంటు పక్క వీధిలో నాకు తెలిసిన వాళ్లింటి నుంచి తెచ్చి పెడ్తాను. అయితే అది ఏపుగా పెరగటానికి, దానికి చీడలు పట్టకుండా ఉండటానికి ఎరువులు మందులు కొంచెం కొనుక్కోండి. అబ్బె ఎంతో అవవండి. మహా అయితే పది రూపాయలు. నెల నెల వచ్చి మీక్కావలసినవి ఇచ్చిపోతూ ఉంటాను. మీకే శ్రమా ఉండదు" అని ఒకర్ని ఉబ్బేసింది.

"ఈ చీర ఎక్కడ కొన్నారూ? ఇక్కడే దొరుకుతుందా! ఎంత కొనుక్కొన్నారూ? అమ్మ బాబోయ్ అంత చవకగానే! నాకు కొనుక్కోవాలని ఉంది. కాని ఎల్లా? నా దగ్గర డబ్బు లేదే! సరకులు అమ్మాలి. కమీషన్ రావాలి? ఇంట్లో ఖర్చులు గడపాలి? ఇంకా అప్పుడు డబ్బు మిగిల్తే చూడాలి! మీరు పెద్ద మనసుతో ఓ పాతిక రూపాయల సరుకులెల్లాగో కొంటారనుకోండి. కాని మీలాంటి వారు అరుదు కదా!" అంటూ మరొకర్ని కరగేసింది.

"కంకటాలవారి షాపులో రిబేటుంది. ఇంకో రెండు రోజుల్దా కా వేగిరం వెళ్లండి."

"జ్యోతి హాల్లో జయసుధ సినిమా ఆడ్తోంది."

"ఫలానా ఎంపోరియంలో విస్కీ గిస్కీ అమ్ముతారు. ఫలానా క్లబ్బులో డబ్బెట్టి పేకాడ్తారు. పొరపాట్న కూడా మీ శ్రీవారిని అటుకేసి వెళ్లనీయకు చెల్లీ!"

కావలసిన వారికి కావలసిన భోగట్టా ఇచ్చింది. నానా తిప్పలు పడింది. మొదటి నెల రెండు వందల యాభై సంపాదించింది.

"నీ సంపాదన రెండు వందల యాభై,నువ్వు కొత్తగా పెట్టుకొన్న పనిమనిషి సింహాచలానికి నువ్విచ్చే జీతం పాతిక. పెరిగిన చాకలి ఖర్చు పాతిక. నీ బస్సు ఛార్జీలు, అయిసు సోడాలు, కాఫీ, టీ ఖర్చులు యాభై. ఎరువులు కొనిపించబోయి కొనుక్కున చీర, అవసరమై కొనుక్కొన్న చెప్పులు ఎనభై. పౌడరు, స్నో ఇరవై. వెరసి రెండువందలు. మిగులు యాభై" నరసరాజు ఆ నెల లెక్కను కనకమహాలక్ష్మికి వివరించాడు.

"వచ్చే నెల చీర ఖర్చు. చెప్పుల ఖర్చు ఉండదు కదా! గుండు చదువుకి యాభై ఇవ్వగలి గాను కదా! కొంచెం చలి తీరింది కదా! వచ్చే నెల మరిన్ని వేణ్ణీళ్లు, వేచి చూడండి!"

౬. అలసట :

"ఏం సింహాచలం! నిన్న పన్లోకి రాలేదేం!"

"రానేదు!"

"అదేం జబాబు?"

"ఏటమ్మా! నానొచ్చానని అబద్ధమాడే నేటమ్మా! నువ్వు దెబ్బలాడీడానికి. సత్తె మొప్పీసు కొన్నాను కదా!"

"ఎందుకు రానేదు? ఛ...నా క్కూడా అలవాటై పోతోందీ నీ నా. ఎందుకు రాలేదని అడుగుతున్నాను." క్రితం రోజు వీధిలో తిప్పటతో పాటు ఇంట్లో పని కూడా చేసుకోడం వల్ల జనించిన కోపాన్ని భోంచేస్తూ అడిగింది కనక మహాలక్ష్మి.

"తల్లీ! ఈదిలో నిలబడిపోయి నీతో తీరుబడిగా ఊసులాడుకోడానికి టయాం నేదు. అయిదింటల పని సెయ్యాలి నాను. నీకా ఆలీసెం అయి పోతుందని, పారొచ్చినాను. " అంది సింహాచలం. పని పట్ల తనకు గల శ్రద్ధను వ్యక్తంచేస్తూ. తన నిల్లా వీధిలో నిలబెట్టి కనక మహాలక్ష్మి కబుర్లాడటం ఎదురింటామె, పక్కింటామెల పని దృష్ట్యా చేస్తున్న సంఘ విద్రోహ

చర్య అన్న విషయం సింహాచలం అతి వినయంగా కనకమహాలక్ష్మి దృష్టికి తీసుకు వచ్చింది సింహాచలం.

కనక మహాలక్ష్మి ఓడిపోయి లోపలికి నడిచి అంట్లు వేసింది.

7. అనుమానం :

"నా గుండీ లెవరు కుడ్తారోచ్" నరసరాజు ఆ ఛాన్సు పోతే దొరకదన్న ధోరణిలో అడిగాడు.

"అమ్మా" అన్నాడు గుండు.

"అన్నం తినడం ఎవరెవరు మానేస్తారోచ్!" అంది వంట చేస్తున్న గుండు తల్లి. ఎవరు చేతు లెత్తలేదు.

"గుండుచేత కుట్టించుకోండి. వాడికి వచ్చును" అంది కనక మమాలక్ష్మి.

"నేను కుట్టను. నేను నా హోమ్ వర్కు చేసుకొంటున్నాను. చేసి స్కూలుకి తీసుకోకపోతే బ్లడీ బగ్గర్స్ తంతారు నన్ను. ఇది నీ హోమ్ వర్కు. నువ్వే చెయ్యి! "అని గుండు కనకమహాలక్ష్మితో తనకి వీలవదని చెప్పాడు. కనక మహాలక్ష్మి కొడుకు చెయ్యనందుకు బాధపడలేదు. మేష్టర్లని బ్లడీ బగ్గర్సని కొడుకు తిట్టినందుకు సంతోషించింది. లేక దొంగ నంజి కొడుకులని తిట్ట నందుకు సంతోషించింది. తన శ్రమ వృధా పోనట్టు, కొడుకు ఇడ్లీ కొబ్బరి పచ్చడి చెయ్యమని అడగకుండా, "రైస్ పుడ్డింగ్ అండ్ కోకోనట్ సాస్" చెయ్యమని కోరిన రోజునే గ్రహించింది.

"అన్నట్టు మా ఆఫీసులో తణుకు నుంచి వచ్చి జేరిందే తరళాక్షి. ఆ పిల్లకి నా గుండీలు కుట్టడం అంటే బోలెడు ముచ్చట. కుట్టించుకోనా?" నరసరాజు అమాయకంగా అడిగాడు.

"తప్పేముంది. కుట్టించుకోండి! రేపెప్పుడైనా నేను మా బాస్ అప్పారావుగారికి గుండీ కుట్టాల్సి వస్తే కుట్టడానికి సంకోచపడక్కర్లేదు, నేనూ ధైర్యంగా కుట్టేస్తాను. మీరూ ఏమీ అనుకోరు."

నరసరాజు ఉడికించబోయి, వంటింట్లోని వంకాయలతో పాటు ఉడికాడు. చొక్కాకి బొత్తాలు కుట్టుకుంటూ.

8. అనుభవం :

కొత్త బిచ్చగాడు పొద్దెరగక పోవచ్చు గాక పాతబడ్డ అమ్మకాల అమ్మాయికి పెందరాళే పొద్దు వాలదా! రెండు నెలలు గడిచేసరికి కనకమహాలక్ష్మి మొదట్లో అంత ఉత్సాహంగా అమ్మకాలు చేయలేకపోతోంది. కొనేవాళ్లలో కొందరు, "నువ్వు కిందటిస్లో ఇచ్చివెళ్లిన సరుకే ఖర్చవలేదు అమ్మాయీ" అని విసుగ్గాను, మరికొందరు. "కొళాయిలో మాకే నీళ్లు రావటం లేదు. మొక్కలకేం పొయ్యగలం. వద్దండీ" అని నిస్పృహతోను, మిగిలిన మొహమాటస్తులు, "మరోసారి కనిపించండి" అని నొచ్చుకొంటూను అంటున్నారు.

కనకమహాలక్ష్మి కొనుగోలుదార్లకోసం సుదూర ప్రాంతాల్లో వల వేయాల్సి వస్తోంది.

దాంతో బస్సు ఛార్జీలు తడిసి మోపెడవుతున్నాయి. ఇంత దురా భారాలవల్ల వేణ్ణీళ్ళు చల్లబడి పోతున్నాయని, చన్నీళ్లలో చన్నీళ్ళు పోస్తే వేడెక్కవనీ, నీళ్లలో నీళ్లు పోస్తే రాముల వారి కాలంలోనే కాక, కలికాలంలో కూడా పాలవవని నరసరాజు చెప్పకుండా కనకమహాలక్ష్మి గ్రహించగల్గింది.

వాన పడ్డ రోజులు. గుండుకి జ్వరం వచ్చిన రోజులు వీలవక అమ్మకానికి పోవటం లేదు. నెల చివర్లో వెళ్లినా కొనే భార్యలు కనిపించక వెళ్లటం మానేస్తోంది. ఆ విధంగా నెలకి పది రోజులు సంపాదన ఉండటం లేదు. ఇంట్లో చూస్తే సింహాచలం అడప తడపా నాగాలు పెట్టేస్తోంది. అటువంటి రోజుల్లో ఇంటి పనితోను, వీధిలో తిరుగుడుతోను కనకమహాలక్ష్మి సతమతమై పోతోంది. పని మనిషిని పని మానిపిస్తే అన్ని రోజులు తనే చేసుకోవాల్సి వస్తుందన్న దారుణమైన సత్యం భయపెట్టడం వల్ల కనకమహాలక్ష్మి సర్దుకుపోతోంది.

అప్పారావే కాకుండా అతని ఎసోసియేట్స్ అందరూ ఒకల్లొకళ్లుగా "ఏటమ్మా! అమ్మ కాలంత చేటు తగ్గించేసావు. ఇంటరెస్టు లేదేటి? పోని ఇంట, రెస్టు తీసుకో పని మానేసి" అనసాగారు.

కనక మహాలక్ష్మి అసలే మూలుగుతూ ఉంటే ఇంటాయన రూపంలో తాటిపండు పడింది.

"ఇంటి టాక్సు, నీటి టాక్సు ఏరాడ కొండెక్కేసాయి. బియ్యం ధర, కిరసనాయిల్ ధర, పెరిగి పోయాయి. నేనీ యిళ్ల మీద వచ్చే అద్దెల మీద బతకాల్సిన వాడిని. మీరేమో ఆలు మగలు ఆర్జించేస్తున్నారు! మా ఇల్లేమో మీకు అచ్చొచ్చింది. అందుకని ఇంటికి వచ్చేనెల నుంచి ఓ పాతిక అద్దె పెంచుతున్నాను. ఇష్టం లేకపోతే ఖాళీ చెయ్యండి. ఇంకోళ్లు కళ్ల కద్దు కొంటూ నేను పెంచిన పాతికకి మరో పాతిక వాళ్ళే పెంచి దిగుతారు" అని దానం తప్పించి మిగిలిన మూడు విధాల ఉపాయాలు వాడాడు.

తామీ ఇంటికిస్తున్న రెండు వందల యాభైకి మరో పాతిక చేరిస్తే ఇంతకంటే మంచి ఇల్లు దొరకకపోదు. పొద్దున్న లేచింది మొదలు తను చాలా వీధులు తిరుగుతుంది. ఎన్నో అందమైన ఇళ్లు. అనుకూలమైన ఇళ్లూ చూస్తూ ఉంటుంది కదా!అందులో ఒకటి ఎవరో ఒకరు ఇవ్వక పోరు తను అడిగితే! అందుకని ఇల్లు వెతక డానికి నిశ్చయించుకొని ఆ మాటే భర్తకి చెప్పింది.

"ఏమిటి? మీరిల్లు ఖాళీ చేస్తారా, మీకు వేరే ఇల్లు దొరికితే! ఎంత మంచి మాట చెప్పారు. ఎప్పుడు ఖాళీ చేస్తారు? మా చెల్లెలు వాళ్లు ఈ ఊరు బదిలీ అయి వచ్చారు. వాళ్ల కింకా ఇల్లు దొరకలేదు. మీరిస్తున్న అద్దె మీద మరో యాభై ఇస్తారు. కాస్త మీ ఇంటి ఓనర్స్‌కి మా వాళ్లను రికమెండ్ చేసి పుణ్యం కట్టుకోండి" అన్నవారున్నారే గాని. "ఇక్కడ ఇల్లుంది రా రమ్మ"న్నవారు లేకపోయారు.

ఒకటి రెండు కనిపించినా తాముంటున్న ఇంటి కంటే చిన్నవి. అయినా ఎక్కువ అద్దె కలవి కనిపించాయి.

సాయంత్రం చెమటోడ్చూ వచ్చిన కనకమహాలక్ష్మి, అంతకంటే ముందు వచ్చిన నరసరాజుతో "దొరకలేదండీ" అంది జాలి గొంతుతో.

కనకమహాలక్ష్మిని ఆ స్థితిలో చూసిన నరసరాజు గుండె ద్రవించిపోయింది. "నువ్వు కూర్చో లక్ష్మీ!" అంటూ ఆమెను కూర్చో బెట్టి ఫాన్ వేసి కాఫీకి నీళ్లు పడేసాడు స్టౌ మీద. మామూలుగా అయితే ఆమె వచ్చి సౌ మీద నీళ్ళు పడేసే వరకు తను నీరసంగా కుర్చీలో కూర్చుని ఆమె కష్టం పట్టించుకొనే స్థితిలో ఉండడు.

"నా మీద మీకెంత ప్రేమండీ" అంది ఆమె అతని కళ్లల్లోకి ఆపేక్షగా చూస్తూ.

కాఫీ తాగి నరసరాజు ఇంటాయన దగ్గరకు వెళ్ళి మరో పది రూపాయలు అద్దె పెంచుతానని మాటి మాటికి తమని ఇల్లు ఖాళీ చెయ్యమని ఒత్తిడి చేయవద్దనిచెప్పి ఒప్పించి ఏనుగెక్కి వచ్చాడు. గుమ్మం పట్టకుండా ఆనందతో పొంగిపోయిన నరసరాజు గుమ్మంలో పట్టడానికి అరగంట పట్టింది. అతను చెప్పిన సంతోష వార్త విని కనక మహాలక్ష్మి గాల్లో తేలిపోయి మంచం పక్కనున్న స్టూలికి తగలకుండా వంటింట్లోకి వెళ్లింది భోజనం ఏర్పాట్లు చెయ్యడానికి.

గుండు, కొత్త స్కూల్లో సంపాదించుకొన్న కొత్త స్నేహితుడి ఇంటి నుంచి కథల పత్రిక తెచ్చుకొని ముందేసుక్కూర్చున్నాడు చదవటానికి. ఇంటికి వచ్చాక కథలదే అయినా పుస్తకం అంటూ ఒకటి పుచ్చుకొని కూర్చున్నందుకు సంతోషించి, అది అందులోను ఇంగ్లీషుది అయినందుకు మరింత సంతోషించింది కనక మహాలక్ష్మి.

"ఏదీ ఒకసారి చూడనీ" అని ఆ పిల్లాడి చేతిలో పుస్తకం తీసుకొని పేజీలు తిరగ వేసింది. ఆమెను అట్ట వెనుకబొమ్మ ఆకట్టుకొంది.

బావి లోపల గోడ మీద పెరిగిన తీగలో చిక్కుకొని ఒక మనిషి తల్ల కిందులుగా వేళ్లాడుతున్నాడు. బావిలో మొసలి అతను పట్టు తప్పి కిందపడితే కబళించాలని నోరు తెరుచుకొని ఎదురు చూస్తోంది. అతను పట్టు చిక్కి గట్టు మీదకి చేరితే ఫలాహారం చేద్దామని ఓ పెద్దపులి మనిషిలాగా ఓర్పు వహించివుంది. మధ్యలో ఒక కొండ చిలువ అతగాడిని తన చుట్టల్లో ఇరికించుకొని చుట్టరికం నెరుపుదామని చూస్తోంది. బావి మీదకు వాలి బావి పక్కనో చెట్టుంది. ఆ చెట్టుకో తేనెపట్టుంది. ఆ పట్టు నుంచి ఉండుండి ఒక బొట్టు తేనె జారి ఆ మనిషి నోట్లో పడ్తోంది. అతను తనున్న భయంకర పరిస్థితుల్ని పట్టించుకోకుండా ఆ తేనె బొట్లని తన్మయత్వంతో చప్పరిస్తున్నాడు.

వరండాలో సిగరెట్టు కాల్చుకొంటూ విశ్రాంతి తీసుకొంటున్న నరసరాజుకి ఆ బొమ్మ చూపించి, "ఈ బొమ్మ చూసారా! మీకేమని పిస్తోంది.?" అని అడిగింది.

"వడ్డాది పాపయ్య దనిపిస్తోంది" అన్నాడు దాన్ని పరిశీలించి చూసి.

"మీ తెలివి తెల్లారింది. అది కాదండి. ఆ పులి, పాము, మొసళ్లని చూస్తుంటే మన మీద ఎప్పుడొచ్చి పడ్తాయో తెలియని ఖర్చుల్లాగాను, ఆ తేనె బొట్టు ఎప్పుడైనా పొరపాటున మనం చేయగలిగిన చిన్న మొత్తాల పొదుపుల్లాగానే అనిపించడం లేదూ!" అంది కనక మహాలక్ష్మి.

"మరే! చన్నీళ్ల సముద్రంలో ఎప్పుడైనా వేడి నీళ్ల బొట్టు రాల్చగలగటమే మనం చేయగలిగిన నిర్వాకం. దానికి నిరంతరం శ్రమించటమే మన జీవిత పరమార్థం. ఇవాళ ఇంటద్దె పెంచడం విషయంలో పదిహేను రూపాయలు ఆదాం చేసాం చూడు అదన్నమాట" అని వ్యాఖ్యానించాడు. ఆపైన సిగిరెట్టు, తుది ముక్కలోని సారాన్ని పొగ రూపంలో తృప్తిగా పీల్చాడు.

విశాఖపట్నపు ఆకాశాన చంద్రుడు ముఖాన్న తెచ్చిపెట్టుకొన్న కళతో ప్రకాశించడం మొదలు పెట్టాడు.

- ఆంధ్ర సచిత్ర వార పత్రిక, '85

★